సాక్షి అనకాపల్లి


శనివారం । 18 । మార్చి । 2023





## ప్రిన్సిపాల్ నియామకం

ఏయూ క్యాంపస్: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య జి.శశిభూషణరావు నియమితులయ్యారు.



## క్షీరాభిషేక సేవ

విశాఖ: కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ పాల్గొన్నారు.



## తీరంలో తాబేలు పిల్లల సందడి

పరవాడ: ఎన్టీపీసీ సహకారంతో ముత్యాలమ్మపాలెంలో పొదిగించిన 150 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను తీరంలో విడిచిపెట్టారు.

## న్యూస్‌రీల్

### వర్షసూచన



అనకాపల్లిటౌన్ : రాగల అయిదు రోజులు మోస్తరు వర్షసూచన ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఈ నెల 18న 10, 19న 42, 20న 30, 21న 18, 22న 12 మి.మీ. వర్షపాతం నమోదవుతుందన్నారు. ఉష్ణోగ్రతలు 24.2 నుంచి 24.6 డిగ్రీలు, గాలిలో తేమ శాతం 82 నుంచి 88, గాలిగంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

### ఏఎంసీలో సీట్ల పెంపు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఆంధ్ర వైద్య కళాశాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల పెంపునకు మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మొత్తం 136 సీట్లకు గానూ రెండు దశల్లో 89 సీట్లు పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి అడ్మిషన్లు కల్పిస్తామని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు. సీటీ సర్జరీ, డీవీఎల్, ప్రసూతి విభాగం, పెథాలజీ, సైకాలజీ, న్యూరాలజీ, సర్జరీ, కమ్యూనిటీ మెడిసిన్‌లో సీట్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.


### ఏపీ పీజీ సెట్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీసెట్ కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ ఆచార్య రమణయ్యకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణ రావు, ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి, ఆచార్య భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

### సినిమా షూటింగ్ ప్రారంభం



నటీనటులపై క్లాప్ కొడుతున్న మేయర్ వెంకట కుమారి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : దొర ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ప్రొడక్షన్ నంబర్ 1 చిత్రం షూటింగ్ శుక్రవారం కైలాసపురం దరి డీఎల్‌బీ కల్యాణమండపం వద్ద గల సాయిబాబా ఆలయంలో ప్రారంభమైంది. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నటీనటులపై క్లాప్ కొట్టారు. ఏప్రిల్‌లో విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో షూటింగ్ జరుపుతామని దర్శక, నిర్మాతలు రామ్‌గోపాల్ రత్నం, హనుమంతు తుకారామ్‌లు తెలిపారు. సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేస్తామన్నారు. ఈ చిత్రంలో వంశీ, ప్రియాంక సింగ్, కీర్తన వర్మలు హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు, గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయికి 16 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోటీలకు విశాఖ జిల్లా నుంచి 16 ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో ఎల్. చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి మెట్ట వెంకట విశ్వేశ్వరరావు తెలిపారు. విశాఖ జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 244 ప్రాజెక్టులు నమోదు చేసుకోగా, జిల్లా స్థాయి పోటీలకు 164 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిని పరిశీలించిన న్యాయనిర్ణేతలు రాష్ట్ర స్థాయికి 16 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోటీలు ఈ నెల 23, 24 తేదీల్లో కాకినాడలో జరుగుతాయన్నారు.

# శిథిల ఆనకట్టలకు మళ్లీ ప్రాణం

- రూ.40 కోట్ల మంజూరుకు సీఎం సానుకూలత
- గోకివాడ, ఏడుమూళ్ల ఆనకట్టలకు చెరో రూ.20 కోట్లు
- డిజైన్ల రూపకల్పనకు ఆదేశాలు
- పనులు పూర్తయితే 13 వేల ఎకరాలకు తీరనున్న సాగునీటి వెతలు



బ్రిటిష్ కాలంనాటి గోకివాడ ఆనకట్ట బాడీవాల్ శిథిల స్థితి



కొట్టుకుపోయిన ఏడుమూళ్ల ఆనకట్ట



కూలిపోయిన ఏడుమూళ్ల మదుం

రాంబిల్లి: బ్రిటీష్ కాలం నాటి ఆనకట్టకు మోక్షం లభించనుంది. మేజర్ శారద నదిపై గోకివాడ వద్ద ఆనకట్ట ఉంది. ఇది శిథిల స్థితిలో ఉంది. కొత్తూరు వద్ద గల ఏడుమూళ్ల ఆనకట్ట నాలుగేళ్ల క్రితం వరద ప్రభావానికి కొట్టుకుపోయింది. 12 వేల ఎకరాలకు సాగునీరందించే గోకివాడ ఆనకట్ట, 1100 ఎకరాలకు సాగునీరందించే ఏడుమూళ్ల ఆనకట్టల పునరుద్ధరణకు రూ.40 కోట్లు మంజూరు చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సానుకూలంగా ఉన్నారు. ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) ఈ ఆనకట్టల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు సీఎం నిధుల మంజూరుకు సానుకూలత వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం ఆనకట్టల విషయాన్ని ప్రస్తావించి డిజైన్లు, మరమ్మతు పనుల అంచనాలు రూపొందించాలని ఆదేశించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలో గల యలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో 12 వేల ఎకరాలకు రాంబిల్లి మండల పరిధిలో గల గోకివాడ ఆనకట్ట ఆధారం. బాడీవాల్, ఏప్రాన్లు, షట్టర్లు దెబ్బతినడంతో ఈ ఆనకట్ట శిథిలావస్థకు చేరింది. దీంతో సక్రమంగా సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక నాలుగేళ్ల క్రితం శారద నదిలో వరద ఉధృతికి ఏడుమూళ్ల ఆనకట్ట కొట్టుకుపోయింది. సుమారు 60 మీటర్ల మేర ఆనకట్ట బాడీవాల్ దెబ్బతింది. అంతేగాక ఈ ఆనకట్టకు కుడివైపున గల ఏడుమూళ్ల డ్యాం కూడా కూలిపోయింది. దీంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆనకట్టకు మరమ్మతు పనులు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని ఈ ఆనకట్ట సమీపంలో మరోచోట కొత్త ఆనకట్ట నిర్మించాలని ఇరిగేషన్ శాఖ సాంకేతిక బృందం నిర్ణయించింది. ఈ మేరకు రూ.20 కోట్ల వ్యయంతో 108 మీటర్ల మేర కొత్త ఆనకట్టను నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇక గోకివాడ ఆనకట్ట మరమ్మతు పనులకు రూ.20 కోట్లు అవసరమని నిర్ధారించారు. ఈ విషయం ఎమ్మెల్యే కన్నబాబు సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో నిధుల మంజూరుకు సానుకూలత వ్యక్తం చేసి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అయితే జిల్లా స్థాయి అధికారులు డిజైన్లు రూపొందించే అవకాశాలు లేవు. శారద నదిలో 2 లక్షల క్యూసెక్కులకు పైగా నీటి ప్రవాహం ఉండటంతో ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యాలయంలోని ప్రధాన ఇంజినీరింగ్ బృందం అంచనాలు రూపొందించాల్సి ఉంది. ఇక్కడ జాప్యం జరుగుతోంది. త్వరగా ఈ బృందం ఈ ఆనకట్టలను సందర్శించి డిజైన్లు, అంచనాలు రూపొందించాలని రైతులు కోరుతున్నారు.

### తీరనున్న సాగునీటి కష్టాలు



గోకివాడ, ఏడుమూళ్ల ఆనకట్టల పనులు పూర్తయితే రైతుల సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ముఖ్యంగా గోకివాడ ఆనకట్ట రైతులకు ఎంతో ప్రధానమైనది. దిమిలి తదితర గ్రామాల పరిధిలో 20 ఎకరాలను సాగు చేస్తున్నాను. ఈ పొలాలకు సక్రమంగా సాగునీరు అందాలంటే గోకివాడ ఆనకట్ట ఎంతో కీలకమైనది. అంతేగాక వరదల సమయంలో గండ్లు పడకుండా ఉండేందుకు గోకివాడ ఆనకట్ట వద్ద కొత్తగా డ్యాం నిర్మాణం చేపట్టడం రైతులకు మరింత మేలు చేస్తుంది. తద్వారా ముంపు ముప్పు తప్పుతుంది.

– దొడ్డ లచ్చుమ్మ, రైతు, దిమిలి

### డిజైన్లు రూపొందించాలి



సీఎం నిధుల మంజూరుకు అంగీకారం తెలపడంతో ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యాలయం అధికారులు డిజైన్లు రూపొందించేందుకు రావాల్సి ఉంది. గోకివాడ, ఏడుమూళ్ల ఆనకట్ట పనులకు రూ.40 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా గుర్తించాం. గోకివాడ ఆనకట్ట వద్ద మైనర్ శారదలో నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా గండ్లు ముప్పు లేకుండా కొత్తగా డ్యాంను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివరామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ

## హాల్ టికెట్ల నిరాకరణపై నివేదిక ఇవ్వండి

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం**

విశాఖ విద్య: ఫీజు చెల్లించలేదనే నెపంతో హాల్ టికెట్లు నిరాకరించిన కారణంగా ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు పరీక్ష రాయలేకపోయిన విషయమై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిణి పి.ఉమారాణికి లేఖ రాసినట్లు కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం వెల్లడించారు. విశాఖ నగరంలోని బీవీకే కాలేజీ పరీక్ష కేంద్రంలో శ్రీనగర్‌లోని ఒకేషనల్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు తొలిరోజు పరీక్ష రాయలేకపోయారు. హాల్ టికెట్ లేకుండా కేంద్రానికి వచ్చిన వారిని నిర్వాహకులు పరీక్ష రాయనివ్వలేదు. ఫీజు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యం హాల్ టికెట్ ఇవ్వలేదని చెప్పడంతో, ద్వారకా నగర్ ఎస్ఐ ధర్మేంద్ర చొరవ తీసుకొని విద్యార్థినులకు హాల్ టికెట్లు ఇప్పించారు. కాలేజీ నుంచి కేంద్రానికి వచ్చినప్పటికీ, సమయం మించిపోవడంతో ఆ విద్యార్థినులను పరీక్ష రాసేందుకు నిర్వాహకులు అనుమతించలేదు. ఇదే విషయం 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితం కావడంతో దీన్ని సుమోటోగా తీసుకున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్.. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అధికారుల సమర్పించే నివేదిక ఆధారంగా కాలేజీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లుగా తేలితే గుర్తింపు రద్దుతో పాటు, క్రిమినల్ చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తామని సీతారాం పేర్కొన్నారు. హాల్ టికెట్లు తీసుకోకుండా విద్యార్థినులు నేరుగా పరీక్ష కేంద్రానికి ఎందుకొచ్చారు? ఇందులో కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం ఏమైనా ఉందనే విషయమై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

# రెండో ప్రాధాన్యత ఓటుతోనే ఫలితం

- మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్
- కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- మొదటి ప్రాధాన్యత ఓట్లలో చిరంజీవిరావుకు 27,209 ఓట్ల ఆధిక్యం
- రెండో స్థానంలో సీతంరాజు, మూడో స్థానంలో రమాప్రభ

చిరంజీవిరావు సీతంరాజు రమాప్రభ

**మొదటి ప్రాధాన్యత ఓట్లలో టాప్-4 అభ్యర్థుల ఓట్ల వివరాలివీ..**

| రౌండ్ | మొత్తం ఓట్లు | చిరంజీవి | సీతంరాజు | రమాప్రభ | మాధవ్ | చెల్లని ఓట్లు |
|---|---|---|---|---|---|---|
| 1 రౌండ్ | 28,043 | 11,828 | 7,780 | 4,898 | 1,424 | 1,539 |
| 2 రౌండ్ | 27,991 | 12,274 | 7,619 | 4,669 | 1,280 | 1,557 |
| 3 రౌండ్ | 27,996 | 12,200 | 7,626 | 4,653 | 1,403 | 1,561 |
| 4 రౌండ్ | 28,005 | 11,517 | 7,813 | 4,788 | 1,563 | 1,688 |
| 5 రౌండ్ | 28,018 | 11,141 | 7,810 | 4,673 | 1,895 | 1,849 |
| 6 రౌండ్ | 28,080 | 10,861 | 7,966 | 5,451 | 1,338 | 1,923 |
| 7 రౌండ్ | 28,000 | 11,381 | 7,765 | 4,522 | 1,865 | 1,831 |
| 8 రౌండ్ | 5,200 | 1,755 | 1,330 | 1,494 | 116 | 370 |
| పోస్టల్ బ్యాలెట్ 643 | | | | | | 288 |

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఎవరూ గెలుపునకు సరిపడా ఓట్లు సాధించకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లే గెలుపును నిర్ణయించనున్నాయి. శుక్రవారం నుంచి రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా సాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో అధికార పార్టీ వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కంటే ప్రతిపక్ష టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు ముందంజలో ఉన్నారు. మొత్తం 8 రౌండ్లు పూర్తయ్యే సరికి 27,209 ఓట్లతో టీడీపీ ఆధిక్యంలో ఉంది. ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటింగ్ జరగ్గా 16న కౌంటింగ్ ప్రారంభమైంది. మొత్తం 2,89,214మంది పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోగా వీటిలో 2,00,926 ఓట్లు పోలయ్యాయి. గురువారం ఉదయం 7 గంటలకు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్సులు తీసుకొచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు కట్టలు కట్టే ప్రక్రియ జరిగింది. 7 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓటు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై.. మొత్తం 8 రౌండ్లలో శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఒక్కో రౌండ్‌కు 28 వేల ఓట్లు చొప్పున (2,00,926+355) ఓట్లను 8 రౌండ్లుగా విభజించారు.

**12 వేలకు పైగా చెల్లని ఓట్లు**

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోని సుమారు 800 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు పొందగా.. వీటిలో 643 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 288 ఓట్లను చెల్లనవిగా పరిగణించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు సాగిన మొత్తం ఎనిమిది రౌండ్ల లెక్కింపులో 12,318 వరకు చెల్లని ఓట్లు నమోదయ్యాయి. చెల్లని ఓట్లలో అధికంగా సీతంరాజు సుధాకర్‌కే వచ్చాయి.

**34 మందికి డిపాజిట్లు గల్లంతు**

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 37 మంది అభ్యర్థులు ఉంటే.. వారిలో 34 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. వీరిలో బీజేపీ మద్దతు అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ కూడా ఉన్నారు. మొత్తం చెల్లిన ఓట్లలో 1/6 వంతు ఓట్లు వచ్చిన అభ్యర్థికే డిపాజిట్లు వచ్చినట్టవుతుంది. అంటే 32 వేల ఓట్లు రావాలి. టీడీపీ మద్దతు అభ్యర్థి చిరంజీవిరావు (82,958 ఓట్లు) ముందంజలో ఉంటే.. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్(55,749 ఓట్లు) రెండో స్థానంలో ఉన్నారు. ఇక పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మిగిలిన 34 మంది డిపాజిట్లు కోల్పోయారు.

**ఎవ్వరికీ దక్కని మ్యాజిక్ ఫిగర్**

ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో మొత్తం 2,01,281 ఓట్లు పోల్ అవ్వగా.. ఇందులో 2,00,926 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 355 ఉన్నాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లు పోను (50 శాతం +1) 94,481+1 వస్తే గెలిచినట్లు డిక్లేర్ చేస్తారు. కానీ ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓటును ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

# గేట్



దేవిడ్ తరుణ్



జస్వంత్

- గేట్ ఎంట్రన్స్ ఫలితాల్లో అన్నదమ్ముల సత్తా
- అన్నకు 76వ ర్యాంక్, తమ్ముడికి 352వ ర్యాంక్



తల్లిదండ్రులు, సోదరితో దేవిడ్ తరుణ్, జస్వంత్

బుచ్చెయ్యపేట : గేట్–2023 ఎంట్రన్స్ ఫలితాల్లో రాజాం గ్రామానికి చెందిన అన్నదమ్ములు ర్యాంక్‌లు సాధించి సత్తా చాటారు. ప్రభుత్వం విడుదల చేసిన గేట్ ఎంట్రన్స్ ఫలితాల్లో అన్నయ్య దేవిడ్ తరుణ్‌కు 76వ ర్యాంక్, తమ్ముడు జస్వంత్ 352వ ర్యాంక్‌తో ప్రతిభ చూపారు. రాజాం గ్రామానికి చెందిన న్యాయవాది గోగుల ఓంవరప్రసాద్, రజని కుమారులు గోగుల దేవిడ్ తరుణ్, జస్వంత్. మూరుమూల గ్రామీణ ప్రాంతంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతూ తమ ప్రతిభను చాటుతున్నారు. చదువులో ఇద్దరు మొదటి నుండి పోటీ పడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పదికి పది మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. అన్నయ్య దేవిడ్ తరుణ్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ చేస్తూ ఆన్‌లైన్ క్లాసుల ద్వారా గేట్ ఎంట్రన్స్ పరీక్షలకు సిద్ధమయ్యాడు. జస్వంత్ శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ మూడో సంవత్సరం చదువుతూ ఆన్‌లైన్ క్లాసులు ద్వారా గేట్ ఎంట్రన్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. గురువారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసిన గేట్ ఫలితాల్లో ఇద్దరూ మెరుగైన ర్యాంకులు సాధించారు.

**కార్పెంటర్ కుమారుడికి 13వ ర్యాంక్**



పండూరి సాయి

నబ్బువరం: ఆరిపాక శివారు పెదయాతపాలెం గ్రామానికి చెందిన కార్పెంటర్ కుమారుడు పండూరి సాయి గేట్‌లో 924 మార్కులతో ఆలిండియా 13వ ర్యాంక్ సాధించాడు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్‌లో డిప్లమో పూర్తి చేశాడు. తర్వాత ఈసెట్‌లో 8వ ర్యాంక్ సాధించి, ఏయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఐఐఎస్సీ బెంగళూరులో పీజీ చేసి, సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడం లక్ష్యమని తెలిపాడు.

# చదువుకున్న కళాశాల కోసం..

- ఏయూ ఫార్మసీ కళాశాల హాస్టల్ నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి దేవ పురాణం విరాళంగా అందించిన రూ.50 లక్షలతో నిర్మించిన హాస్టల్ భవనం అందుబాటులోకి వచ్చింది. తన తల్లిదండ్రులు 'లలితాదేవి పురాణం-కోటిలింగ మూర్తి పురాణం'పేరుతో చదువుకున్న కళాశాలకు ఈ మొత్తం అందించగా.. ఫార్మసీ కళాశాలకు అనుకుని విద్యార్థినులకు హాస్టల్ భవనం నిర్మించారు. ఈ హాస్టల్ భవన సముదాయాన్ని శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో దేవ పురాణం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థిని ప్రశంసించారు.

## నూకాంబిక ఉత్సవ సంరంభం



ఊరేగించిన అమ్మవారి ఉత్సవ విగ్రహం



జాతర సన్నాహకంగా బలంగీర్ బాజా డ్యాన్స్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ నెల 20 నుంచి జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఉత్సవ విగ్రహ రథాన్ని ఊరేగించారు. 108 ఘటాలతో సాగిన భారీ ఊరేగింపులో అమ్మవారి వేషాలు, కోలాటాలు, చిడతలు, తప్పెటగుళ్లు, పులివేషాలు, శూలాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

IIలో

# ఏప్రిల్ నుంచి 139 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

**రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి**



కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జానకీదేవి

కె.కోటపాడు: జిల్లాలో రీసర్వే కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి చెప్పారు. కె.కోటపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె వార్షిక తనిఖీ నిర్వహించారు. 2019 నుంచి 2022 వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా వచ్చిన చలానా, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జానకీదేవి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా రీసర్వే పూర్తయిన కోటవురట్ల మండలం చోల్లంగిపాలెం, అచ్యుతాపురం మండలం గంగమాంబ అగ్రహారం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండో విడతగా ఏప్రిల్ నుంచి 139 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయా సచివాలయాల్లో సిబ్బందికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ల నిర్వహణపై శిక్షణ కూడా ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ వార్షిక ఏడాదిలో అనకాపల్లి జిల్లాకు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ద్వారా రూ.306 కోట్ల 73 లక్షల ఆదాయం రావాలని లక్ష్యం కాగా ప్రస్తుతానికి రూ.225 కోట్ల 46 లక్షల ఆదాయం సమకూరిందని జానకీదేవి వివరించారు. అదే విధంగా కె.కోటపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.6 కోట్ల 44 లక్షలకు ప్రస్తుతానికి రూ.4 కోట్ల 65 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

## నేడు కళాభారతిలో అన్నమయ్య వర్ధంతి

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): అన్నమయ్య 520వ వర్ధంతిని మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శని,ఆదివారాలలో నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్. గుమ్ములూరి రాంబాబు తెలిపారు. శనివారం సాయంత్రం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అన్నమాచార్య సంకీర్తన వైభవం కార్యక్రమాన్ని సంగీత సాహిత్య సౌరభంగా నిర్వహించనున్నామన్నారు. చైతన్య సోదరులు వారి శిష్య బృందం 70 మందితో సప్తగిరి సంకీర్తన గానం చేస్తారన్నారు.

## క్లుప్తంగా

### నేడు భారత్-ఆస్ట్రేలియా జట్ల రాక

- స్టేడియంలో ఫ్లడ్‌లైట్స్ పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: భారత్-ఆస్ట్రేలియా రెండో వన్డే మ్యాచ్‌కు వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. ఆదివారం డే నైట్‌గా జరగనున్న ఈ మ్యాచ్‌కు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లను శుక్రవారం వన్డే నిర్వాహక కమిటీ పరిశీలించింది. స్టేడియం అంతటా ఏ విధంగా ఫ్లడ్‌లైట్ల వెలుతురు ఉందనే విషయాన్ని పరిశీలించిన కమిటీ చైర్మన్, విశాఖ పోర్టు చైర్మన్ కె.రామ్మోహన రావు కాసేపు బ్యాటింగ్ చేశారు. తొలుత నిర్వాహక కమిటీ భేటీలో ఏర్పాట్లను సమీక్షించారు. టికెట్ల విక్రయంతో పాటు ప్రవేశ ద్వారాల వద్ద బార్‌కోడ్ పరిశీలన ఏర్పాట్లు, అనౌన్స్‌మెంట్, స్టేడియం వద్దకు వచ్చే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, మంచినీరు, ఆహార పదార్థాల విక్రయం తదితర విషయాలపై చర్చించారు. మూడంచెల భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, ఈపీడీసీఎల్ ఎండీ సంతోష్‌రావు, ఏసీఏ, వీడీసీఏ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

**నేడు ఇరుజట్ల రాక**

సిరీస్ తొలిమ్యాచ్‌లో విజయ కేతనం ఎగురవేసిన భారత్ జట్టుతో పాటు ఆస్ట్రేలియా జట్టు సభ్యులు శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో నగరానికి చేరుకోనున్నారు. తొలి మ్యాచ్‌కు కుటుంబ కార్యక్రమం కోసం వెళ్లిన రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు విశాఖ వచ్చే సూచనలున్నాయి. వన్డేల్లో డబుల్‌సెంచరీ హీరోలు ఇషాన్ కిషాన్, శుభమన్ గిల్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లితో పాటు జట్ల సభ్యులు రానున్నారు.

### వాహనాల వేలంలో రూ.88 వేల ఆదాయం

పాయకరావుపేట: సారా కేసులో పట్టుబడిన వాహనాలకు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వేలం వేసినట్లు ఎస్ఈబీ సీఐ పి.టి.వి.కుమార్ శుక్రవారం తెలిపారు. రెండు ఆటోలు, ఒక రిక్షా, మరో మూడు మోటారు బైక్‌లకు వేలం వేయగా రూ.88,192 ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా 32 అక్రమ సారా రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న సారాను పారబోశామన్నారు. అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# కోలాహలంగా ఘటాల ఊరేగింపు



రహదారి పొడవునా అమ్మవారి ఘటాలతో భక్తులు



ఊరేగింపుగా బయల్దేరిన ఘటాల ఊరేగింపు

- ఆకట్టుకున్న శూలాల ప్రదర్శన
- ఆకర్షణగా నిలిచిన నేలవేషాలు

అనకాపల్లి టౌన్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ నెల 20 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు నిర్వహించేందుకు వివిధ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పురవీధుల్లో శుక్రవారం ఉత్సవ విగ్రహ రథాన్ని ఊరేగించారు. ముందుగా ఈ రథాన్ని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ ప్రారంభించారు. 108 ఘటాలతో భారీ ఊరేగింపు జరిగింది. తెలంగాణ కళాకారుల పొట్టి పోతురాజు విన్యాసాలు, కేరళ కళాకారుల డప్పువాయిద్యాలు, రాజమహేంద్రవరం కళాకారుల అమ్మవారి వేషాలు, విజయనగరం కళాకారుల పులివేషాలు, కోలాటాలు, చిడతలు, తప్పెటగుళ్లు, గరిడీ, ఒడిశా కళాకారుల బలంగీర్‌బాజా, అమ్మవారి భక్తులు ధరించిన శూలాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. వివిధ రకాల నేల వేషాలు రథోత్సవం ముందు ఆకర్షణగా నిలిచాయి. నూకాంబిక అమ్మవారి మాలధారణ సేవా సంఘం అధ్యక్షుడు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరరావు దంపతులు, పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి బుద్ద మహాలక్ష్మీనగేష్, సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, వైఎస్సార్‌సీపీ 80, 81వ వార్డుల ఇన్‌చార్జులు కొణతాల భాస్కరరావు, పీలా రాంబాబు, సభ్యులు సూరిశెట్టి ఉదయ్, కోలపర్తి శ్రీను, మళ్ల గణేష్, అక్షయ్ రాజు, పవన్, కృపా సాగర్ పాల్గొన్నారు.



పులి వేషధారణలో నృత్యాలు



అమ్మవారి శూలాలు ధరించిన భక్తులు

# కోటి ఉపాధి పని దినాలు కల్పనే లక్ష్యం

**డ్వామా ఉమ్మడి జిల్లా అడిషనల్ పీడీ రోజారమణి**



సాంకేతిక సహాయకులతో ఉపాధి పనుల నిర్వహణపై చర్చిస్తున్న పీడీ రోజారమణి

రోలుగుంట: జిల్లాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు కోటి పని దినాలు కల్పనే లక్ష్యమని ఆ శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా డ్వామా అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.రోజారాణి తెలిపారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సాయంత్రం సందర్శించారు. మండలంలో చేస్తున్న ఉపాధి పనులు, కూలీల హాజరు తదితర విషయాలపై ఆ శాఖ సాంకేతిక సహాయకులను ఆరా తీశారు. ఉపాధి పనుల రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వేతనదారులతో ఉపాధి పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయించాలన్నారు. వారు చేసిన పనికి గాను రూ.250 గిట్టుబాటు కూలి పొందే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేతనదారులు నిబంధనల మేర పని చేయాలన్నారు. చేసిన పనులకుగాను గత నెల 20వ తేదీ వరకు వేతనాలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. జిలాల్లో ఇంకా రూ.28 కోట్లు బకాయిలున్నాయన్నారు. వీరికి ఏ విధమైన ఇబ్బందులు ఎదురు కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సామాజిక తనిఖీలో దుర్వినియోగమైన నిధులను సంబంధికుల నుంచి దశల వారీగా రాబడుతున్నామన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి అధికారం బృందం ఉమ్మడి జిల్లాలో పర్యటించనుందన్నారు. వారం రోజుల పాటు ఉపాధి పనులను తనిఖీ చేయనుందని వివరించారు.

# ప్రభుత్వ ప్రామాణికాల మేరకు వైద్య సేవలు



నక్కపల్లి ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎన్‌హెచ్‌ఆర్‌ఎం బృందం



ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న జేడీ నర్సింగరావు

**నక్కపల్లి ఆస్పత్రిని తనిఖీ చేసిన కాయకల్ప చికిత్స బృందం**

నక్కపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ జాయింట్ డైరెక్టర్(విజయవాడ) డాక్టర్ నర్సింగరావు సూచించారు. ఎన్ఆర్‌హెచ్‌ఎం ఏర్పాటు చేసిన కాయకల్ప చికిత్స బృందం (పర్యవేక్షణ బృందం) శుక్రవారం నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని సందర్శించింది. డాక్టర్ నర్సింగరావు నేతృత్వంలో ఆపరేషన్ థియేటర్లు, ఇన్‌పేషంట్, ఫార్మసీ, ఓపీ, తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. రోగులకు వద్దకు వెళ్లి వైద్య సేవలపై ఆరా తీసింది. అనంతరం వైద్య సిబ్బందినుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రామాణికాలను అనుసరించి ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. నక్కపల్లి, కోటవురట్ల, నర్సీపట్నం ఆస్పత్రులను ఈ బృందం పరిశీలిస్తుందన్నారు. నక్కపల్లి, కోటవురట్ల ఏరియా ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచి సదుపాయాలు కల్పించారన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో వైద్య పరికరాలు, మందులు కొనుగోలు చేయాలన్నారు. ఆస్పత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఇక్కడ కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న సేవలను తెలియజేస్తూ బోర్డులు, సిటిజన్ చార్టులు ప్రదర్శించాలని సూచించారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది వివరాలు బోర్డులపై నమోదు చేయాలన్నారు. టెస్టులు, వైద్య పరికరాల వివరాలు రోగులకు తెలియజేయాలన్నారు. ఈ ప్రామాణికాలన్నీ పాటిస్తేనే తదుపరి నిధులు విడుదల చేస్తామన్నారు. మరోసారి ఆస్పత్రిని తనిఖీ చేస్తామని, తాము సూచించిన విధంగా ఇక్కడ పనితీరు ఉండాల్సిందేనని పేర్కొన్నారు. ఈ బృందంలో వైద్యులు వేణు, సౌమ్య, సూపరింటెండెంట్ జనార్దన్ తదితరులు ఉన్నారు.

# నెలాఖరులోగా శతశాతం ఇంటి పన్నుల వసూలు

**జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి**

దేవరాపల్లి: జిల్లాలో ఈ నెలాఖరులోగా ఇంటి పన్నుల బకాయిలు శత శాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి ఆదేశించారు. శుక్రవారం ఆమె దేవరాపల్లిలో మండలంలో పర్యటించి మంచినీటి ట్యాంక్‌లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ సచివాలయం-2లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో రూ.34 కోట్లు మేర ఇంటి పన్నులు బకాయిలు ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 56 శాతం మేర వసూలు చేశామని, మిగిలినవి ఈ నెలాఖరులోగా వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 646 గ్రామ పంచాయతీలకుగాను 476 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి వచ్చాయన్నారు. మిగిలినవి అతి త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వేసవిలో డయేరియా తదితర అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మంచినీటి ట్యాంక్‌ల క్లీనింగ్, క్లోరినేషన్‌ను చేపట్టాలని ఆదేశించారు. 15 రోజులకొకసారి క్లోరినేషన్ పక్కాగా చేయించాలన్నారు. ట్యాంక్ వద్ద బ్లాక్ బోర్డుపై క్లీనింగ్ తేదీని నమోదు చేయించాలన్నారు. ఐఎస్ఐ మార్కు బ్లీచింగ్‌ను మాత్రం కొనుగోలు చేయాలన్నారు. స్పందన అర్జీల పట్ల తక్షణమే స్పందించి పరిష్కార మార్గం చూపాలని సూచించారు. ఈ విషయంలో దేవరాపల్లి మండలం పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పంచాయతీ విస్తరణాధికారి కె. ఉషశ్రీ తదితర్లు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శిరీషారాణి



## లక్క బొమ్మల తయారీ అద్భుతం

- ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి



ఏటికొప్పాకలో లక్కబొమ్మలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

యలమంచిలి: సహజ సిద్ధమైన రంగులు, స్థానికంగా లభించే అంకుడు కర్రతో ఏటికొప్పాక కళాకారులు ఎంతో అద్భుతంగా లక్క బొమ్మలు తయారు చేస్తున్నారని ట్రైనీ కలెక్టర్ ధాత్రీ రెడ్డి అన్నారు. ఏటికొప్పాకలో శుక్రవారం పర్యటించిన ఆమె కళాకారులు తయారు చేస్తున్న బొమ్మలను పరిశీలించి, వాటి తయారీ గురించి తెలుసుకున్నారు. మహిళలకు అందిస్తున్న వివిధ రుణాలపై ఆరా తీశారు.లక్క బొమ్మల తయారీ ద్వారా వచ్చే ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏటికొప్పాకలో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కొంతమంది కళాకారులు ఆమెను కోరారు. ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే లక్కబొమ్మల తయారీని ప్రోత్సహించినట్టు ఉంటుందని వారు చెప్పారు. అనంతరం తమ సమస్యలను వివరించారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ట్రైనీ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ భర్త సేనాపతి రాము,ఏపీఎం రాణీ, డిరమణబాబు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాయకరావుపేట: రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. శుక్రవారం ఉదయం విశాఖపట్నం నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్టు చెప్పారు. మృతుడు తెలుపురంగు షర్టు, కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. బోదకాళ్లు ఉన్నట్టు తెలుస్తోందని, మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి తరలించినట్టు ఎస్.అబ్దుల్ మారూఫ్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

## రేషన్ బియ్యం వాహనం బోల్తా

హుకుంపేట: మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పాము రాయి గ్రామం వద్ద రేషన్ బియ్యం వాహనం ప్రమాదానికి గురైంది.పాముురాయి గ్రామంలో బియ్యం పంపిణీ చేసేందుకు కామయ్యపేట నుంచి వాహనం వెళ్లింది. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనం రోడ్డు కిందకు జారి పోయింది.



ప్రమాదానికి గురైన బియ్యం వాహనం

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హుకుంపేట: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ సతీష్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చీకుమద్దుల పంచాయతీ పెదనందిపుట్టు గ్రామానికి చెందిన వంతాల నాగేశ్వరరావు(26) సమీపంలోని కొండపైకి వెళతానని ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి కనిపించడం లేదని అతని భార్య సంగీత జనవరి 26న పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాలించినా ఫలితం లేకపోయింది. సమీప గ్రామాలకు చెందిన కొందరు గిరిజనులు బొడ్డెంగులు తీసేందుకు కొండపైకి వెళ్లగా ఒక లోయలో మృతదేహం కనిపించింది. వారి సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించిన కుటుంబ సభ్యులుగా నాగేశ్వరరావుగా నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కాఫీ తోటల వద్ద ప్రమాదానికి గురైన కారు, ఆటో

అనంతగిరి: మండలంలోని భీసుపురం సమీపంలోని కాఫీ తోటల వద్ద కారు,ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. విజయనగరం ప్రాంతానికి చెందిన వారు వ్యాపార నిమిత్తం అరకులోయ వారపు సంతకు ఆటోలో వెళ్లి తిరిగివస్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న కె.రాజ్‌కుమార్, పి.మాధన్‌లకు తీవ్ర గాయాలు కాగా, రాముకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలోని అనంతగిరి ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

## క్లుప్తంగా

### 'తుమ్మపాల సుగర్స్‌కు నిధులివ్వాలి'

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు ఎటువంటి ప్రయోజనాలు కల్పించలేదని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు అన్నారు. గవరపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పరిశ్రమల శాఖకు కేటాయించిన రూ.2,600 కోట్లలో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణకు నిధులు రాబట్టేలా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కృషి చేసి, ఈ ప్రాంత రైతాంగం రుణం తీర్చుకోవాలని ఆయన కోరారు.

### ప్రశాంతంగా ఫస్టియర్ ఇంగ్లిష్, ఒకేషనల్ పరీక్షలు



ఏఎంఏఎల్ కళాశాలలో పరీక్షల అనంతరం బయటకు వస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జనరల్ ఇంగ్లిష్, ఒకేషనల్ సబ్జెక్టుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,342 మంది విద్యార్థులకు గాను 3,266 మంది హాజరుకాగా, 76 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావివ్వకుండా నిఘా నేత్రంలో పరీక్షలు జరిగాయి.

### కాలేషావలి బాబా చందనోత్సవం నేడు



నరసింగబిల్లిలోని హజరత్ కాలేషావలి బాబా దర్గా

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి గ్రామం వద్దనున్న హజరత్ కాలేషావలి బాబా దర్గా 71వ ఉరుసు షరీఫ్(చందనోత్సవం) శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ అహ్మద్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు జెండా ప్రతిష్టాపన, సాయంత్రం 6 గంటల నుంచి బాబా చందనోత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం ఫాతెహా, ప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| సార్ | రాజా |
| ఫలానా అబ్బాయి | |
| ఫలానా అమ్మాయి | సత్యనారాయణస్క్రీన్-1 |
| మనసిస్తావా | సత్యనారాయణస్క్రీన్-2 |
| కబ్జా | షిర్డిసాయి |
| బలగం | పర్తిసాయి |
| షజామ్ | వెంకటేశ్వర |
| పులి | శ్రీసత్య |
| జంతు ప్రపంచం | రామచంద్ర |

## బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6529 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ | 3,860 | 4,110 |
| మొదటి రకం | 3,670 | 3,960 |
| రెండో రకం | 3,420 | 3,750 |
| మూడో రకం | 3,130 | 3,440 |





# అక్కచెల్లెమ్మలకు ఆర్థిక 'ఆసరా'

అక్కచెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారికి ఆర్థిక భరోసా కల్పించేలా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగి, కుటుంబానికి ఆసరాగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. అక్కచెల్లెమ్మలకు ఆర్థిక అండదండలు అందిస్తూ, చిరు వ్యాపారాలతో స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తోంది.

- మూడో విడత వైఎస్సార్ ఆసరా జాబితాలు సిద్ధం
- ఇప్పటికే రెండు విడతల్లో రూ.54 కోట్ల లబ్ధి
- 25న లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.37.45 కోట్లు



వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల వద్దకు వెళ్లి పథకం లక్ష్యాన్ని వివరిస్తున్న ఉద్యోగులు



కశింకోటలో వైఎస్సార్ ఆసరా ప్రీ లాంచింగ్‌పై మహిళతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ సిబ్బంది

అనకాపల్లి రూరల్ : 2019 ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణాల మొత్తాన్ని 4 విడతల్లో అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేస్తామని ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటికే రెండు విడతల్లో సొమ్ములు చెల్లించి అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచారు. ప్రస్తుతం మూడో విడత లబ్ధిదారులకు ఈ నెల 25న నగదు బదిలీ చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో అర్హులైన మహిళల ఖాతాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నగదు బదిలీ చేస్తారని గ్రామీణాభివృద్ధి సంస్థ అధికార యంత్రాంగం వెల్లడించింది. అర్హులైన లబ్ధిదారుల బయోమెట్రిక్ సేకరించడంతో తుది జాబితాలను సిద్ధం చేశారు.

**మాట తప్పేది లేదు**

తన పాదయాత్రలో మహిళల కష్టాలు, ఆర్థిక ఇబ్బందులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కళ్లారా చూశారు. తాము అధికారంలోకి వస్తే సార్వత్రిక ఎన్నికల వరకు సక్రమంగా రుణాలు చెల్లించిన పొదుపు మహిళలకు నాలుగు విడతల్లో తిరిగి ఆ మొత్తాన్ని జమ చేస్తామని హామీ ఇచ్చారు. కోవిడ్ కష్టకాలం, వరుసగా రెండేళ్లు ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ మేరకు రెండు విడతలుగా ఆసరా సొమ్మును అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేశారు. తాజాగా మూడో విడత ఆసరా నిధుల్ని అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**రెండు విడతల్లో రూ.54 కోట్ల లబ్ధి**

మొదటి విడత రుణమాఫీ కింద అనకాపల్లి నియోజకవర్గంలో 3,395 స్వయం సహాయక సంఘాల్లోని 35,252 మంది మహిళల ఖాతాల్లో రూ.27.18 కోట్లు జమ అయ్యాయి. రెండో విడతలో 3,400 సంఘాల్లోని 35,283 మంది మహిళలకు రూ.27.30 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది. మూడో విడతలో 4669 సంఘాల్లోని మహిళలందరికీ వారి ఖాతాల్లోకి రూ.37.45కోట్లు చెల్లించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో గుర్తించిన లబ్ధిదారుల జాబితాలను సిబ్బంది ఇప్పటికే ప్రదర్శించారు. ప్రస్తుతం ప్రీ లాంచింగ్‌లో భాగంగా డీఆర్‌డీఏ సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆసరా పథకం గురించి వివరిస్తున్నారు.

**సామాజిక తనిఖీలతో సమస్యలకు చెక్**

వైఎస్సార్ ఆసరాను సమర్థవంతంగా అమలుచేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. ఆసరా సొమ్ము జారీలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాబితాల ఆధారంగా సచివాలయాల వద్ద సామజిక తనిఖీలు చేపట్టారు. అనంతరం లబ్ధిదారుల జాబితాలను రూపొందించారు. ఎవరైనా సభ్యులు చనిపోయినా, నామినీ వివరాలు సక్రమంగా లేకపోయినా అలాంటి సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించి అర్హులకు సొమ్ము అందేలా జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తోందంటూ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### స్వయం ఉపాధికి మార్గం

వైఎస్సార్ ఆసరా పథకం కింద ఇప్పటికే రెండు విడతల్లో ప్రభుత్వం సాయం అందించింది. మూడో విడతకు ఏర్పాట్లు చేస్తున్నాం. బయోమెట్రిక్, సోషల్ ఆడిట్, అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది జాబితా సిద్ధం చేశాం. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలుచేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకుని, ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వం ఇస్తున్న నగదు సాయానికి మరికొంత రుణాన్ని తీసుకుని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి.

– కె.కుమారస్వామి,
డీపీఎం, గ్రామీణాభివృద్ధి సంస్థ

# ఉగాదికి జగనన్న ఇళ్లు పూర్తి

మండల ప్రత్యేకాధికారి రోజారాణి



కశింకోటలో మండల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రోజారాణి



సమావేశానికి హాజరైన మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

కశింకోట : వైఎస్సార్ జగనన్న ఇళ్లను నిర్దేశిత లక్ష్యం మేరకు ఉగాదికి పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉగాదికి వైఎస్సార్ జగనన్న లే అవుట్లలో 830 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు గడువు నాటికి అన్ని ఇళ్లకు శ్లాబ్‌లు పడాలని ఆదేశించారు. అలాగే ఇంకా ప్రారంభించని ఇళ్లను ఈ నెలాఖరులోగా మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీరికి ఇళ్ల పట్టాలు ఇచ్చి రెండేళ్లు కావస్తుందని, దీని దృష్ట్యా నిబంధనల్లో పేర్కొన్న మేరకు ఇళ్ల ప్రారంభించకపోతే వాటికవే రద్దు అవుతాయన్నారు. సత్వరమే ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. పనులు చేసిన వాటికి చెల్లింపులు జరపడానికి నిధులు మంజూరైనట్టు వెల్లడించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం మెరుగుకు గ్రామాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వీధి దీపాలు వెలిగేలా చూడాలన్నారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూముల రీ సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా త్వరితగతిన చేపట్టాలని పేర్కొన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ సురేష్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రమణ, వెంకటలక్ష్మి, చిన్నోడు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

# యోగాతో మహిళలకు మరింత ఆరోగ్యం



మహిళల యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీలా లక్ష్మీసౌజన్య

తుమ్మపాల : యోగా మహిళల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో గవరపాలెం మల్ల జగన్నాథం హాల్లో మహిళలకు ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా అనేక సమస్యలను నయం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఇంటిలోను యోగాసనాలు చేయడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. మహిళల్లో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు యోగా చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు భీశెట్టి దొరమునాయుడు మాట్లాడుతూ పట్టణంలో జార్జి క్లబ్ వద్ద ఇప్పటికే యోగా కేంద్రం నిర్వహిస్తున్నామని, మహిళల కోసం మరో కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించినట్టు తెలిపారు. ప్రతి రోజు కనీసం గంట సమయం యోగాసనాలు వేస్తే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందగలమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు సాయి నాగేశ్వరరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, దాడి శ్రీను, కాండ్రేగుల గోవిందు, మహిళలు పాల్గొన్నారు.

# నూకాంబిక రోడ్డులో ఆక్రమణల తొలగింపు

అనకాపల్లిటౌన్ : కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జోన్ టౌన్ ప్లానింగ్ అధికారి డి.విజయ్ కుమార్ తెలిపారు. ఈ రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను శుక్రవారం తమ సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజులపాటు జరగనున్న అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు వస్తారని, వారికి ఇబ్బందుల్లేకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, వ్యాపారస్తులు, దేవాలయ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాన్ని నిర్వహించేందుకు వివిధ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ తొలగింపుల్లో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు న్యాయం చేయాలి

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్లో దివ్యాంగులను విస్మరించడం ఆక్షేపణీయమని విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించి, న్యాయం చేయాలని ఆయన కోరారు.

# 200 మందికి దంత వైద్య పరీక్షలు



దంత వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

అనకాపల్లి రూరల్ : దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ సూచించారు. తుమ్మపాల ప్రధాన రహదారిలో సాయిబాబా గుడి వద్ద జీవిత బీమా పాలసీదారుల సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అనంతరం అనకాపల్లి పీవీకే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి దంత వైద్య నిపుణులు వెంకటేష్, నితిన్ వైద్య శిబిరానికి వచ్చిన సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముమ్మన అప్పారావు, టీడీపీ నేత, మాజీ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, తుమ్మపాల ఉపసర్పంచ్ చదరం చిన్నా, యరబండ్ల సత్యనారాయణ, బొడ్డుపాటి రాజారావు పాల్గొన్నారు.

# డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి

తుమ్మపాల : జిల్లా కేంద్రం అనకాపల్లిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేసి రోగులకు సేవలందించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి శుక్రవారం వినతిపత్రం అందించారు. జిల్లాలో అధిక సంఖ్యలో నిరుపేద మహిళలు, క్వారీ కార్మికులు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వీరిలో ఎక్కువ మంది డయాలసిస్ రోగులున్నారని తెలిపారు. వీరంతా స్థానికంగా డయాలసిస్ కేంద్రం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఒక్కసారి డయాలసిస్ చేసుకోవాలంటే కనీసం రూ.ఆరు వేలు చెల్లించాల్సి వస్తుందని, అనేక మంది రోగులకు వారంలో రెండు సార్లు డయాలసిస్ అవసరమవుతోందన్నారు. పట్టణంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు ద్వారా ఇలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

# వారపు సంత, డైలీ మార్కెట్‌కు వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ మహేష్

సబ్బవరం: మేజర్ పంచాయతీ పరిధిలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతపాటతో పాటు రైతులు పండించే కూరగాయలకు సంబంధించి డైలీ మార్కెట్ వేలం పాట శుక్రవారం నిర్వహించారు. మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి మహేష్ ఆధ్వర్యంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యుల సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో అధిక సంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు. ఆదివారం సంత పాటను స్వయంవరపు బుజ్జి అనే వ్యక్తి రూ. 2 లక్షల వెయ్యికి దక్కించుకున్నారు. అదే విధంగా డైలీ మార్కెట్ పాటను గొర్లివానిపాలేనికి చెందిన జి. నాయుడుబాబు రూ. 3,21,000లకు పాడుకున్నారు. ఈ పాటలో సుమారు 61 మంది వ్యాపారులు పాల్గొన్నారు. గత సంవత్సరం కరోనా కారణంగా డైలీ మార్కెట్, ఆదివారం సంత వేలం పాటలు సజావుగా సాగలేదని సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు తెలిపారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, వార్డు సభ్యులు సబ్బవరపు శివ, పోతల కనకరాజు, బి. లక్ష్మణ, ఎన్. కోటి, చిత్రాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారాభివృద్ధికి రుణ సౌకర్యం



డాక్టర్ నవీన్‌కొలాట్‌కు చెక్కును అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆర్ఎం నటరాజ్

అనకాపల్లిటౌన్ : వివిధ రకాలైన వ్యాపారస్తులకు, వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా రుణసౌకర్యం కల్పిస్తుందని యూనియన్ బ్యాంక్ విశాఖ రీజనల్ మేనేజర్ కె.నటరాజ్ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు యూనియన్ బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న రుణ సౌకర్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అనకాపల్లి క్లస్టర్ బ్రాంచ్‌ల ద్వారా రూ.9 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. బ్యాంక్ అందిస్తున్న వివిధ లోన్ల గురించి వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఏజీఎం తిలక్, బ్రాంచ్ మేనేజర్లు, ఖాతాదార్లు పాల్గొన్నారు.



# మోటారు కాలిపోవడంతో నిలిచిన నీటి సరఫరా



మండలానికి నీరందించే రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్

కశింకోట : మండల గ్రామాలకు రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏలేరు కాలువ నీటిని సంపతిపురం వద్దనున్న భారీ రక్షిత మంచినీటి పథకం ద్వారా శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం ఇక్కడి మోటార్ కాలిపోయింది. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కశింకోటలో వీధి కుళాయిలు వస్తున్నా, ఇంటింటి కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తక్షణమే మోటారుకు మరమ్మతులు చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. దీనిపై రక్షిత మంచినీటి పథకం ప్రాజెక్టు సూపర్‌వైజర్ మోహన్‌ను 'సాక్షి'సంప్రదించగా మోటారు మరమ్మతులు పూర్తి చేసి, నీటి సరఫరాకు సత్వర చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

# వైఎస్సార్ ఆసరా పథకంపై అవగాహన

ఇంటింటి ప్రచారంలో వెలుగు సిబ్బంది



కశింకోటలో సర్పంచ్ మంత్రి జయరజనికి జాబితాను అందిస్తున్న ఏపీఎం శ్రీనివాసరావు



వెదురుపర్తిలో లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తున్న సర్పంచ్ అరుణ, వీవోఏ సత్యశ్రీ

కశింకోట : వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత జమకానున్న నిధుల గురించి స్వయం సహాయక సంఘాల మహిళలకు వెలుగు సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కశింకోటలో వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం కింద కశింకోటలో 356 స్వయం సహాయక సంఘాల్లోని 3,883 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఈ నెల 25న రూ.3.58 కోట్లు జమకానున్నట్టు తెలిపారు. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాను సర్పంచ్ మంత్రి జయరజనికి అందించారు. కార్యక్రమంలో సీసీ సత్యనారాయణ, వీవోఏ రాము పాల్గొన్నారు.

- బయ్యవరంలో 59 స్వయం సహాయక సంఘాలలో 638 మందికి రూ.36 లక్షలు, నరసింగబిల్లి 78 సంఘాలకు రూ.49 లక్షలు మూడో విడత నగదు మంజూరైంది. ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి, మంజూరు పత్రాలను సర్పంచ్‌లు గొల్లవిల్లి జయ, కోన అరుణలకు వెలుగు సిబ్బంది అందజేశారు. వీవోఏలు జోగిరత్నం, హేమ, సత్య, సీసీ అనూరాధ, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.
- వెదురుపర్తిలో వీవోఏ సత్యశ్రీ ఆసరా పథకం నిధుల మంజూరుపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి స్వయం సహాయక సంఘానికి మూడో విడతగా ఆసరా సొమ్ము రూ.90 వేలు రానుందన్నారు. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాను సర్పంచ్ శనివాడ అరుణకు అందించారు.

# శిథిల కాలువలతో సమస్యలు



శిథిలావస్థకు చేరిన కాలువ

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం గ్రామంలో మురుగు కాలువల దుస్థితి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వినాయక ఆలయం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని చెబుతున్నారు. దోమల బెడద వల్ల కంటి మీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లోని మురుగు నీటి వల్ల దుర్వాసన వస్తోందని.. అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కాలువలకు మరమ్మతులు చేపట్టి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# డిగ్రీ కళాశాల బోటనీ లెక్చరర్‌కు డాక్టరేట్



స్వామినాయుడుకు ఉత్తర్వులు అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

సబ్బవరం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పని చేస్తున్న డాక్టర్ పి. స్వామినాయుడుకు ఏయూ డాక్టరేట్ లభించింది. వృక్షశాస్త్ర విభాగం సహాయ ఆచార్యుడు పి. బలరామస్వామి ఆధ్వర్యంలో 'ఎత్నో బొటానికల్ స్టడీస్ ఇన్ ది షెడ్యూల్డ్ మండల్స్ ఆఫ్ విశాఖ డిస్ట్రిక్ట్' అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ ప్రకటించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆయన ఉత్తర్వులు అందుకున్నారు.